

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- కూకట్‌పల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

నేడు కూకట్‌పల్లిలో పంద్రాగస్టు వేడుకలు

కూకట్‌పల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కృష్ణారావు జాతీయ జెండాను ఎగురవేస్తారని ఆయన క్యాంపు కార్యాలయ సిబ్బంది గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూకట్‌పల్లి డివిజన్ శేషాద్రి కమ్యూనిటీ హాల్, ఏవీబీపురం యూనియన్ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బాలాజీనగర్ డివిజన్‌లో శ్యాస్‌లేక్, కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 1లో, తెలంగాణ తల్లి విగ్రహం, కేపీహెచ్‌బీ 3ఫేజ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, పటేల్ కోర్టు, హైదర్‌నగర్ చౌరస్తా, మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డు లారీ అసోసియేషన్‌లలో జాతీయ జెండాను ఎమ్మెల్యే ఎగురవేయనున్నట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో..

హైదర్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సంఘాల సమాఖ్య కూకట్‌పల్లి చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం వివేకానందనగర్ వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్స్ భవనంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుక నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం 4.30గంటలకు జరిగే కార్యక్రమంలో కశ్మీర్ పహల్గాం దాడి, ఆపరేషన్ సింధూర్, ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన పరిణామాలపై చర్చ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది, సాహితీవేత్త బ్రహ్మశ్రీ నారుమంచి వెంకట అనంతకృష్ణ హాజరవుతారని తెలిపారు.

● నాలా పనుల పరిశీలన



అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వి.రామారావునగర్ నాలా పనులను జీహెచ్ఎంసీ ఏఈ రంజిత్, డీఈ, తదితర అధికారులు గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు రాజుచారి, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

- అల్లాపూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి)

● షిరిడీ సాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠ



బాలానగర్ డివిజన్ జేపీ ఆర్ ద్వారకమయి కాలనీలో సద్గురు శ్రీ షిరిడీసాయినాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

● జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సందడి



వార్-2 సినిమా విడుదల సందర్భంగా గురువారం జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కేపీహెచ్‌బీలో సందడి చేశారు. విశ్వనాథ్ థియేటర్ 70ఎంఎం వద్ద ఎన్టీఆర్ కటౌట్స్ పట్టుకొని ఫ్యాన్స్ కేరింతలు కొట్టారు. జై ఎన్టీఆర్ జైజై ఎన్టీఆర్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)

కూకట్‌పల్లిలో ఇందిరమ్మ క్యాంటీన్లు రెడీ!

- ఇప్పటికే సర్కిల్‌కు ఒకటి చొప్పున ఆధునికీకరణ
- వార్డుకు ఒకటి చొప్పున నిర్వహణకు ఏర్పాట్లు
- ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపేందుకు ఇందిరమ్మ క్యాంటీన్లు రెడీ అవుతున్నాయి. గతంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.5కే మధ్యాహ్న భోజన కేంద్రాల స్థానంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనం పెడుతున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెట్టేలా కంటైనర్లతో క్యాంటీన్‌లను కొత్తగా రూపకల్పన చేశారు. ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవం రోజున సర్కిల్‌కు ఒకటి చొప్పున ప్రారంభించాలని అనుకున్నా వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇందు కోసం జీహెచ్ఎంసీ అధికారులు సర్కిల్‌కు ఒకటి చొప్పున కంటైనర్ ఏర్పాటు చేసి, ఆధునికీకరించి రెడీగా ఉంచారు.

జంట సర్కిళ్ల పరిధిలో వార్డుకు ఒకటి

జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో వార్డుకు ఒకటి చొప్పున ఇందిరమ్మ క్యాంటీన్లను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సర్కిల్‌కు ఒకటి చొప్పున రెడీ చేసి మంత్రులు లేదా ఎమ్మెల్యేల చేత ప్రారంభించాలని అనుకున్నారు. అంతే స్పీడ్‌గా కూకట్‌పల్లి సర్కిల్‌లోని హైదర్‌నగర్ డివిజన్ పరిధి భాగ్యనగర్ కాలనీ లేబర్ అడ్డా వద్ద గతంలో ఉన్న చిన్న



కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో ఆధునికీకరించిన ఇందిరమ్మ క్యాంటీన్

డబ్బాలను తొలగించి విశాలంగా ఉండే పెద్ద కంటైనర్ ఏర్పాటు చేశారు. ఇక మూసాపేట్ సర్కిల్ పరిధిలోని బాలాజీనగర్ డివిజన్ పరిధి కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో గతంలో ఉన్న పాత డబ్బాలను తొలగించి పెద్ద కంటైనర్ తెచ్చి పెట్టారు. ఆగస్టు 15న ఇందిరమ్మ క్యాంటీన్లు ప్రారంభించాలనే ముందస్తు నిర్ణయం కాస్త వాయిదా పడినట్లు సమాచారం.

మూడు చోట్ల కొత్త కంటైనర్లు ఏర్పాటు

కూకట్‌పల్లి సర్కిల్‌లో మూడు చోట్ల ఉన్న చిన్న డబ్బాలను తొలగించి కొత్త కంటైనర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే భాగ్యనగర్‌లో ప్రారంభోత్సవానికి రెడీ చేశాం. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, కూకట్‌పల్లి డివిజన్ ప్రశాంత్‌నగర్‌లో పాత వాటిని తొలగించాం. త్వరలోనే అక్కడ కొత్త కంటైనర్లు ఏర్పాటు చేస్తున్నాం.

- వేజెండ్ల శ్రీనివాసరావు, శానిటేషన్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ డీఈఈ, కూకట్‌పల్లి సర్కిల్

మూసాపేట్ సర్కిల్ పరిధిలో..

మూసాపేట్ సర్కిల్ పరిధిలో డివిజన్‌కు ఒక క్యాంటీన్ నడిపేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో గతంలో ఉన్న క్యాంటీన్‌ను తొలగించి విశాలంగా ఉండేలా కొత్తది ఏర్పాటు చేశాం. సర్కిల్ పరిధిలో డివిజన్‌కు ఒకటి చొప్పున పాత వాటిలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాం.

- డా.కార్తీక్, ఏఎంవోహెచ్, మూసాపేట్ సర్కిల్

నిల్చోని ప్లేట్లు పెట్టుకొని తినేలా ఏర్పాట్లు

ఇందిరమ్మ క్యాంటీన్లలో నిల్చోని ప్లేట్లు పెట్టుకొని తినేలా ఏర్పాట్లు చేశారు. విద్యుత్తు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వాహణ వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు. దీంతో ప్రైవేటు టిఫిన్ సెంటర్లు, మెస్‌లకు ఏమాత్రం తగ్గకుండా పేదలకు అన్ని రకాల వసతులతో ఇందిరమ్మ క్యాంటీన్లు ఆహ్వానం పలకనున్నాయి. ప్రతిరోజూ ఒకటే టిఫిన్ కాకుండా రోజుకు ఒకటి చొప్పున పెట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు మధ్యాహ్న భోజనం పెట్టనున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

క్యాంటీన్ల ఏర్పాటుకు స్థలాల కోసం వేట

ప్రస్తుతం ఓల్డ్‌బోయిన్‌పల్లిలో రెండు కేంద్రాలు ఉండగా ఒకటి మూసేసినట్లు అధికారులు తెలిపారు. వార్డుకు ఒకటి ఏర్పాటు చేయాలన్న ఆదేశాలు ఉండటంతో కూకట్‌పల్లి సర్కిల్ వివేకాందనగర్ డివిజన్‌లో స్థలాల వేట కొనసాగిస్తున్నారు. ఎక్కువ మంది పేదలు గుమిగూడే ప్రాంతంలో పెడితే ప్రయోజనం ఉంటుందని అధికారులు ఆలోచిస్తున్నారు. కార్పొరేటర్ మాధవరం రోజాదేవి సూచనలు, సలహాలతో రెండు చోట్ల పరిశీలించారు. త్వరలోనే అక్కడ కొత్తగా ఒక క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు. ఇక మూసాపేట్ సర్కిల్ పరిధి మూసాపేట్ డివిజన్‌కు మాత్రం బాలాజీనగర్ డివిజన్ పరిధి జీహెచ్ఎంసీ కార్యాలయం ఎంట్రన్స్‌లో ఉన్న దాన్నే కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు.



కేపీహెచ్‌బీ పీఎస్‌లో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలని కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు కేవీ సుబ్బారావు, రాజశేఖర్‌రెడ్డి సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకొని గురువారం వినాయక మండపాల నిర్వాహకులు, సంబంధిత సెక్టార్ల ఎస్సైలతో ఎస్‌హెచ్‌వోలు సమన్వయ సమావేశం నిర్వహించారు. సాధారణ ప్రజానికానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండపం ఏర్పాటు, నిమజ్జనం జరిగే తేదీ, లేక్ వివరాలు కచ్చితంగా ఉండాలన్నారు. రాత్రి 10గంటల సమయానికి మైక్‌లు బంద్ చేయాలని, డీజేలకు అనుమతి లేదని వారు తెలిపారు. కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్‌లో ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 3కిలోల గంజాయి, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫతేనగర్ పార్థివాడకు చెందిన ఇస్లి పర్వేష్ (26), సన్నీ (19) ఫతేనగర్ పరిసర ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారు. వీరి దందాపై పక్కా సమచారమందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం నిఘా పెట్టింది. వీరిద్దరూ బుధవారం ఫతేనగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి, 3 కిలోల గంజాయి, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న ముంతాజ్, ఎస్లి రజని, ఎస్లి సాయిరాజ్, కాలి కఖన్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తదుపరి విచారణ కోసం నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని బాలానగర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

అక్రమ నిర్మాణం సీజ్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ పరిధి కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు ఎదురుగా ఉన్న ఈడబ్ల్యూఎస్ 1076లో ఉన్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు సీజ్ చేశారు. సదరు నిర్మాణంపై ఫిర్యాదులు రావడంతో గురువారం మూసాపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కరుణాకర్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది రెండోసారి సీజ్ చేశారు. గతంలో హెచ్చరించి సీజ్ చేసినా మళ్లీ సీల్ తొలగించి పనులు చేయడంపై ఏసీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేసుకోవాలని ఆయన సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు శిక్ష



డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష పడినవారితో ట్రాఫిక్ పోలీస్

కూకట్‌పల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగిరికి మేడ్చల్- మల్కాజిగిరి కోర్టు అదనపు జిల్లా జడ్జి రెండురోజులు జైలుశిక్ష విధించారని కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్ తెలిపారు. కూకట్‌పల్లి పరిధిలోని సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్ వద్ద వారంరోజుల క్రితం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురు ద్విచక్రవాహనదారులు పట్టుబడ్డారు. వారి ద్విచక్రవాహనాలు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. గురువారం మేడ్చల్- మల్కాజిగిరి కోర్టులో వారిని హాజరుపర్చగా జడ్జి వారికి రెండు రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి డాక్టర్ వచ్చారు..



ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ (ఫైల్)



కొత్తగా వచ్చి వైద్యం చేస్తున్న డా.రిషిత

కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సీపీఆర్ కాలనీలోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మూడు నెలలు కావస్తున్నా... ప్రధాన వైద్యుడు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో 'వైద్యులు లేక అందని వైద్యం' అనే అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో ఆగస్టు 4వ తేదీన ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. డా.రిషితను ఇక్కడ విధులు నిర్వర్తించాలని ఆదేశించడంతో ఆమె బాధ్యతలు తీసుకున్నారు.

పీహెచ్‌సీలో బీపీ, షుగర్ టెస్టులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రభుత్వ పట్టణ పీహెచ్‌సీలో ప్రతీ గురువారం రక్తపోటు, షుగర్ టెస్టులు చేస్తుంటారు. అయితే కుత్బుల్లాపూర్ పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడంతో పరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు సరిగా రాలేదని స్థానికులు చెబుతున్నారు. తిరిగి డాక్టర్‌ను నియమించడంతో గురువారం బీపీ, షుగర్ టెస్టులు చేయించుకునేందుకు ప్రజలు వస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

సైనికులను ఆదర్శంగా తీసుకోవాలి

యువతకు బీజేపీ నాయకుల పిలుపు



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జాతీయ జెండాల పంపిణీ



పేట్‌బషీరాబాద్ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



గండిమైసమ్మ చౌరస్తాలో తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దుండిగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ ప్రధాని మోడీ పిలుపు మేరకు దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం బౌరంపేట, గండిమైసమ్మ చౌరస్తాలో త్రివర్ణ పతాక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతీ భారతీయుడి గుండెల్లో అణు వణువునా దేశ భక్తి నిండి ఉండాలని ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా ఉండాలన్నారు. గ్రామాల్లో రైతులు దేశం కోసం, సరిహద్దుల్లో సైనికులు తమ ప్రాణాలను లెక్క చెయ్యకుండా కంటికి రెప్పలా దేశాన్ని కాపాడుతున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. భారత జాతి ఐక్యత చాటాలని కోరుతూ ఈ హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి దుండిగల్ విఘ్నేశ్వరా చారి, జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, రాష్ట్ర ఎస్టీ మోర్చ ఉపాధ్యక్షులు శ్యామ్‌రావు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు గోను మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు నల్లా రామచంద్రారెడ్డి, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



పేట్‌బషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఇంటింటికీ జాతీయ జెండాలు

పేట్‌బషీరాబాద్, (ఆంధ్రజ్యోతి): యువతలో దేశ భక్తి భావాన్ని నింపడం, జాతీయ సమైక్యతను బలపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి అన్నారు. హర్‌ఘర్ తిరంగ ర్యాలీని ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహిస్తూ ఇంటింటికి జాతీయ జెండాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, డివిజన్ అధ్యక్షులు జి. రాజు, ఎన్ దుర్గయ్య, ఎన్ ప్రతాప్, కృష్ణ, సాయిలు, గంగాధర్, క్షత్రి, ప్రసాద్, మహిళలు ఉన్నారు.



జగద్గిరిగుట్ట డివిజన్ జీడిమెట్లలో జాతీయ జెండాల పంపిణీ

వర్షాలతో జాగ్రత్త : సీఐ సుధీర్ కృష్ణ

గాజులరామారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూరారం పోలీస్ స్టేషన్ సీఐ సుధీర్‌కృష్ణ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వెదర్ అప్‌డేట్‌ను ప్రజలు ఫాలో అవుతూ బయటకు వెళ్లేటప్పుడు వాహన దారులు నిదానంగా వెళ్లాలని, నీరు నిలిచే ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండి, వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో లోతట్టు ప్రాంతాల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రజలు సూరారం పోలీస్ స్టేషన్ 8712663299, సీఐ సుధీర్‌కృష్ణ 8712663337 నంబర్లకు ఫోన్ చేస్తే పోలీసులు సహాయక చర్యలు చేపడతారన్నారు.

నూతన పోల్స్‌ను ఏర్పాటు చేయాలి

గాజులరామారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు గాజులరామారం డివిజన్‌లోని మల్లారెడ్డినగర్ ప్రధాన రోడ్డు మధ్యలో ప్లాస్టిక్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు అతి వేగంగా వెళుతూ, పోల్స్‌ను ఢీకొట్టడంతో అవి విరిగిపోయాయి. దీంతో ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు వెళ్తూ ప్రమాదాల భారిన పడుతున్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన



కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ జెపిఆర్ ఎన్‌క్లేవ్‌లో గురువారం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. ఉత్సవానికి బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యువ మోర్చ నాయకుడు ఒక్కంటి దయాకర్ కాలనీ వ్యవస్థాపకులు పోరెడ్డి జయప్రకాష్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

గాజులరామారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆదిత్యాది నవగ్రహ సహిత పంచముఖ వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గురువారం గాజులరామారం మహాదేవపురం షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో భూమి పూజలు చేశారు.

రోడ్లపైనే మురుగు..!



రుక్మిణీ ఎస్టేట్ నుంచి పారుతున్న మురుగు



పెట్రోల్‌బంక్ సమీపంలో నిలిచిన నీరు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్‌లో మురుగు నీటి సమస్యతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా కాలనీలు, బస్తీలు, ఏర్పాటు కావడంతో అప్పటి జనాభాకు అనుగుణంగా వేసిన పైప్‌లైన్‌లు, భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్‌ల సామర్థ్యం ఇప్పుడు సరిపోక పోవడంతో నిత్యం ఏదో ఒకచోట మురుగు రోడ్లపై పారుతోంది. దీంతో రోగాల భారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెన్నెలగడ్డ నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి రాఘవేంద్ర కాలనీ ప్రధాన రహదారి నుంచి బ్యాంక్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి వద్ద ఆగి మడుగును తలపిస్తోంది. ఇండియన్ పెట్రోల్‌బంక్ వీధిలోని రహదారిపై మురుగు నిత్యం పారుతోంది. సుచిత్రా నుంచి కుత్బుల్లాపూర్ రోడ్డులో గణేష్‌నగర్ హౌజింగ్ సొసైటీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై నాలాలో ప్రవహిస్తున్న మురుగు ప్రధాన రహదారిలో నిలుస్తోంది. చినుకు పడితే ఈ ప్రాంతాల్లో నడవాలంటే నరక యాతనే అని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.

ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయండి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు సందర్భంగా ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర్య పోరాటయోధులను స్మరిస్తూ, వారి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

ఖాళీ చేయండి

● శిథిలావస్థ భవనాల్లో ఉంటున్న వారికి ఉపకమిషనర్ ఆదేశం

చందానగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థ భవనాల్లో ఉంటున్న వారు ఖాళీ చేయాలని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ శశిరేఖ ఆదేశించారు. మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్లలో తొమ్మిది పురాతన భవనాలను అధికారులు గుర్తించారు. నాలుగు పురాతన భవాల్లో ఉన్నవారిని వెంటనే ఖాళీ చేయించమని అధికారులకు సూచించారు.



కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ జెండా ఏర్పాటు చేస్తున్న బీజేవైఎం నాయకులు

'హర్ ఘర్ తిరంగా'లో అందరూ భాగస్వాములు కావాలి

హైదర్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ సూచించారు. గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయ జెండా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇల్లు, కార్యాలయాలపై జాతీయ జెండా ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని సూచించారు.



గచ్చిబౌలిలో రోడ్డుపక్కన చెత్తకుప్పలు



గోపన్‌పల్లిలో రోడ్డుపక్కన చెత్తాచెదారం

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

● గచ్చిబౌలిలో రోడ్లవెంట పలుచోట్ల చెత్తకుప్పలు

● దుర్వాసన.. దోమల బెడదతో ప్రజల ఇబ్బంది

రాయదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. అధికారుల నిర్లక్ష్యం, ప్రజల బాధ్యతా రాహిత్యంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలి, రాయదుర్గం, గోపన్‌పల్లి, ఎన్టీఆర్‌నగర్, మధురానగర్, రాయదుర్గం ముస్లిం బస్తీ ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. వర్షానికి తడిసి దుర్వాసన రావడంతోపాటు దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చెత్తకుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం

కాలనీల్లో రోజుల తరబడి చెత్త నిల్వ ఉంటోంది. వర్షాలకు కుళ్లి దుర్వాసన వస్తుండడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. దోమల విజృంభణతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. చెత్త కుప్పల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రవీందర్‌రెడ్డి, రాయదుర్గం

చెత్తకుప్పల తొలగింపునకు చర్యలు

కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో రోజువారీగా పారిశుధ్య పనుల నిర్వహణలో సమస్య తలెత్తుతోంది. చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించినా కొంతమంది రోడ్లపైనే చెత్త వేస్తున్నారు. ప్రజలు సహకరించాలి. చెత్తకుప్పల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ వైద్యాధికారి**

రేపు పీఎంజీ ఫామ్‌హౌస్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్‌లోని పీఎంజీ ఫామ్‌హౌస్‌లో ఈనెల 16న ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వేదికను బృందావనాన్ని తలపించేలా వివిధ రకాల లీలాస్థలులతో అలంకరిస్తున్నారు. ప్రధానంగా శ్రీకృష్ణుడి 5252వ అవతార దినోత్సవం సందర్భంగా 5252 నైవేద్యాలను స్వామివారికి సమర్పిస్తున్నారు. భక్తులు సాత్విక నైవేద్యాలు తయారు చేసి తీసుకొచ్చి సమర్పించవచ్చు. ఇందుకు ప్రతిగా మహా ప్రసాదాన్ని అందజేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పిల్లలకు పాటలు, నృత్యాలు, కలరింగ్, ఫ్యాన్సీ డ్రెస్, శ్లోక పఠనం లాంటి పోటీలను నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5.30 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు, రాత్రి 8 గంటలకు కథా-కీర్తన, రాత్రి 9 గంటలకు మహాభిషేకం, 10 గంటలకు ప్రత్యేక దర్శనం ఉంటుందని, రాత్రి 12 గంటలకు భక్తులందరికీ మహా ప్రసాదం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వర్షాలతో అంతరాయం లేకుండా వాలెట్ పార్కింగ్, టెంట్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రవేశం ఉచితం. వివరాలకు 7093116108 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో..

భెల్‌కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోగల మురళీకృష్ణ దేవాలయం శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలకు ముస్తాబైయింది. శుక్రవారం నుంచి మూడురోజుల పాటు వేడుకలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నిత్యపూజలు, విశేష అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని దేవాలయ ప్రధాన అర్చకుడు జితేంద్ర తెలిపారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై విద్యార్థులకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. గురువారం గచ్చిబౌలి పరిధిలోని సాధన స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ హోంగార్డు అశోక్‌కుమార్ స్కూల్ బస్సులో రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ పేరుతో రూపొందించిన బుక్స్ పంపిణీ చేశారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

● విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

రాయదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని నుంచి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా ఖోర్దా జిల్లాకు చెందిన దీనబంధు(40), అభిషేక్ మహాపాత్ర అలియాస్ సోను(23) రాయదుర్గం మల్కం చెరువు వద్ద గంజాయి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పది కిలోల సరుకు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా దస్‌పల్లా గ్రామానికి చెందిన జోగేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు నిందితులు అంగీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్‌స్టేషన్ పరిశీలన



మియాపూర్‌లో సబ్‌స్టేషన్‌ను టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, సీఈ కామేష్, ఎస్‌ఈ రవికుమార్, డీజీ జనప్రియ గురువారం పరిశీలించారు. కొత్త లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సీఎండీని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కోరారు. **- మియాపూర్, ఆంధ్రజ్యోతి**

విద్యుద్దీపాల వెలుగులు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో చందానగర్ మున్సిపల్ కార్యాలయం

- చందానగర్, ఆంధ్రజ్యోతి



రోడ్లపై ఉంటున్న వారిని అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆలేటి ఆశ్రమానికి తరలించిన పోలీసులు

నేటి నుంచి శ్రావణ మాస బోనాలు

భెల్‌కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు శ్రావణ మాస బోనాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు, అర్చనలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక భజనలు జరుగనున్నాయి. శనివారం కుంకుమార్చనలు విశేష అభిషేకాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం బోనాల సందర్భంగా అమ్మవారికి విశేష పుష్పార్చన, కుంకుమార్చనలు, సాయంత్రం కాలనీలో ఘటాలు, పోతరాజుల ఊరేగింపుతో బోనాలు ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల పుష్పాలు, విద్యుత్‌దీపాలతో అలంకరించారు.